యజమానులు, డ్రైవర్ల సమస్యను పరిష్కరించండి

● రవాణా మంత్రిని కోరిన మధుయాష్కీగౌడ్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లారీ, ఆటో, కారు యజమానుల, డ్రైవర్ల సమస్యలను విన్నవిస్తున్న మధుయాష్కీగౌడ్

చాదర్‌ఘాట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో, లారీ, కారు యజమాను లు, డ్రైవర్లు, వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ మంగళవారం రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరారు. ఐఎన్‌టీయూసీకి అనుబంధమైన తెలంగాణ స్టేట్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ స్టేట్ కారు డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ లారీ ఓనర్స్, డ్రైవర్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మధుయాష్కీగౌడ్‌ను కలిశారు. తమ సమస్యలను వివరించి ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన మంత్రిని కలిసి ఆయా యూనియన్ల ప్రతినిధులు వివరించిన సమస్యలను విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఆటో, లారీ, కారు యజమానులు డ్రైవర్లు, వర్కర్లు ఎంతో కృషిచేశారని వివరించారు. యూనియన్ల ప్రతినిధులు నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లేష్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్

గోవర్ధన్‌కు సాంఘిక సంక్షేమ అవార్డు

● మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రదానం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్‌కు ఉత్తమ సాంఘిక సంక్షేమ అవార్డు దక్కింది. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి సీతక్క, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య చేతుల మీదుగా ఉత్తమ సాంఘిక సంక్షేమ అవార్డును గోవర్ధన్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17ఏళ్ల ఉద్యమ పోరాట ఫలితంగా తనకు అవార్డు లభించిందన్నారు. ఇప్పటి వరకు మూడు అవార్డులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ

కొత్తపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ బలరాం, అధికారి మమత, ఆర్కేపురం, చైతన్యపురి, గడ్డిఅన్నారం కార్పొరేటర్లు పాల్గొన్నారు.



లెప్రా సొసైటీ సంస్థ పంపిణీ చేసిన పాదరక్షలతో లెప్రసీ బాధితులు

లెప్రసీ బాధితులపై వివక్ష చూపరాదు

● జిల్లా లెప్రసీ అధికారి పాపారావు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల సంతోష్‌నగర్ లెప్రసీ కాలనీలో లెప్రా సొసైటీ సంస్థ ప్రతినిధులు కుష్ఠువ్యాధి బాధితులకు ఎంసీఆర్ పాదరక్షలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా లెప్రసీ అధికారి పాపారావు, పారామెడికల్ అధికారి సులోచన ముఖ్య అతిథిగా హాజరై కుష్ఠువ్యాధి బాధితులకు పాదరక్షలను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లెప్రసీ బాధితుల పట్ల వివక్ష చూపించరాదని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ప్రతినిధి బాబురావు, డీపీఎంవో శాంతిరాజు, స్లాప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్, పుల్లయ్య, పెంటయ్య, అజీజ్, ప్రమీలా పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

జనప్రియ అపార్ట్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనప్రియ అపార్ట్‌మెంట్‌లో జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఈఈ కార్తీక్, డీఈ నగేష్‌నాయక్, ఏఈ విజయ్‌కుమార్, విద్యుత్ డిప్యూటీ ఈఈ పున్నానాయక్, సిటీ ప్లానర్ శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ వాసుల కోసం ఓపెన్ జిమ్‌తో పాటు పిల్లల ఆట వస్తువుల కోసం నిధులను మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు రోడ్డు మరమ్మతులను చేయిస్తానన్నారు. అపార్ట్‌మెంట్ పరిసరాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, చెత్త, మట్టి కుప్పలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. క్యాబ్ పిచ్ నిర్మాణం, ఫుట్‌పాత్‌లపై టైల్స్ మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆర్మీ శ్రీధర్, నరేష్, జూపల్లి ప్రవీణ్, విష్ణు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ బాలాపూర్ మండల కమిటీ ఎన్నిక

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ బాలాపూర్ మండ ల కమిటీ కార్యవర్గాన్ని మంగళవారం బాలాపూర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోయల్, ఉపాధ్యక్షులుగా జంగయ్య, జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా మాల్యానాయక్, కోశాధికారిగా స్వామి, బాలాపూర్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా శ్రీరామ్, నాదర్‌గుల్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా ఎన్.లక్ష్మయ్య, ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కన్వీనర్‌గా శ్రావణ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శివజ్యోతిలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా కె.గోపాల్‌నాయక్, ఎన్నికల అధికారులుగా కె.కిషన్‌నాయక్, శంకర్‌నాయక్ వ్యవహరించారు.

పార్కు స్థలంలోని కంటెయినర్ బాక్స్ తొలగింపు

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ వెంకటేశ్వరనగర్‌కాలనీలో దాదాపు వేయి గజాల పార్కు(ఖాళీ) స్థలాన్ని హైడ్రా అధికారులు కబ్జాదారి నుంచి కాపాడారు. సదరు స్థలంపై కన్నేసిన కొందరు కబ్జారాయుళ్లు అక్రమ పద్ధతిలో డాక్యుమెంట్లు సృష్టించారు. ఖాళీ స్థలంలో కంటెయినర్ డబ్బా ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ కార్యాలయం తెరవడానికి ప్రయత్నించారు. దాంతో కాలనీవాసులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ రంగనాథ్ మంగళవారం తమ విభాగం సిబ్బందిని పంపించి పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన కంటెయినర్ డబ్బాను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగింపజేశారు. తమ ఫిర్యాదుకు స్పందించి ఖాళీ స్థలాన్ని కాపాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



బడంగ్‌పేట్‌లో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో మేయర్ పారిజాతారెడ్డి, కమిషనర్ సరస్వతి తదితరులు



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా, మేయర్ దుర్గ తదితరులు



జానకీ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను మంగళవారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట్‌లో నిర్వహించిన ర్యాలీని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించగా కమిషనర్ సరస్వతి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ పారిశుధ్య సిబ్బందిని సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి అక్కడ విక్రయిస్తున్న వస్తువులను పరిశీలించారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.3కోట్ల విలువైన రుణాలకు సంబంధించిన చెక్కును అందజేశారు.

మీర్‌పేట్‌లో..

మీర్‌పేట్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీని టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ప్రారంభించగా మేయర్ దుర్గాదీప్‌లాల్, కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, పలువురు కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.3కోట్ల విలువైన రుణ చెక్కులను అందజేశారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి

ఉచిత వైద్య శిబిరం

ఎల్‌బీనగర్ : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో శానిటేషన్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, డీఈ నగేష్‌నాయక్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆర్మీ శ్రీధర్, నరేష్, జూపల్లి ప్రవీణ్, విష్ణు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్ : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మాసబ్‌చెరువు వరకు నిర్వహించిన ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్లతో కలిసి మాసబ్‌చెరువులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హరిత, కౌన్సిలర్లు మంగమ్మ, కవిత, ఐలయ్య, శివలింగంగౌడ్, అనురాధ, భాగ్యమ్మ, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్ పాల్గొన్నారు.

చంపాపేట : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హస్తినాపురం డివిజన్ నందనవనంలోని వార్డు కార్యాలయంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్లు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో అర్బన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీబీ షోరూం నుంచి 5వ వార్డు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందికి సేఫ్టీకిట్స్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విద్యావిజయేందర్‌రెడ్డి, అనురాధాసురేష్, రాజేందర్‌ముదిరాజ్, అర్చనదామోదర్, హరిశంకర్‌ముదిరాజ్, కృష్ణారెడ్డిసిద్దంకి, డీఈఈ శివానందం, సుమంత్, మేనేజర్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తి వేయడానికి ప్రభుత్వం కుట్ర

● మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

హయత్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శాసన సభ్యులకు, మంత్రులకు జీతాలు మూడు రెట్లు పెంచారు. ఉద్యోగులకు రెండు సార్లు జీతాలు పెంచారు. వృద్ధాప్య పెన్షనలు ఐదు రెట్లు పెంచారు. మరి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఎందుకు పెంచలేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వనస్థలిపురం బీఎన్‌రెడ్డి నుంచి హస్తినాపురం వరకు విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీకి ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో చదువుతున్న 16లక్షల75వేల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు విడుదల చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని కొందరు అధికారులు, ప్రభుత్వం కలిసి మొత్తానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేయడానికి కుట్ర చేస్తున్నారని ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. అదే గనుక జరిగితే రాష్ట్రంలో అన్ని కులాల విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన రూ.4వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.20వేలు, కర్నాటకలో రూ.15వేలు కేటాయిస్తున్నారని తెలంగాణలో కేటాయిస్తున్న రూ.5,500 కోట్లు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. తెలంగాణలో కూడా రూ.20వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీసీ సంఘం నాయకులు మల్లేష్‌యాదవ్, రాజేంద్ర, సతీష్, రాందేవ్, రామకృష్ణ, రఘుపతి, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి వల్ల పేదలకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



జియో స్మార్ట్ ఇండియా 2024 ఎక్స్‌పోలో జీఎస్‌ఐ స్టాల్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్ అసిత్ సాహ

జియో స్మార్ట్ ఇండియా 2024 ఎక్స్‌పోలో జీఎస్‌ఐ స్టాల్ ఏర్పాటు అభినందనీయం

● జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ అసిత్ సాహ

కొత్తపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హైటెక్స్ వేదికగా నిర్వహిస్తున్న జియో స్మార్ట్ ఇండియా 2024 ఎక్స్‌పోలో జీఎస్‌ఐ స్టాల్ ఏర్పాటు అభినందనీయమని జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ అసిత్ సాహ అన్నారు. నాగోల్ బండ్లగూడలోని భారత భూగర్భ పరిశోధన సంస్థ(జీఎస్‌ఐ) సహా, జీఎస్‌ఐ శిక్షణ సంస్థ విభాగాలు శాస్త్రసాంకేతిక, భూగర్భ పరిశోధనాంశాలకు అద్దం పట్టేలా పోస్టర్లు, పలు రకాల పరిశోధనాంశాల పరిచయం చేసే సాహిత్యం మంగళవారం జియో స్మార్ట్ ఇండియా 2024 ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు జీఎస్‌ఐ సహకారాన్ని అందిస్తోందనే వాస్తవాన్ని ఈ ప్రదర్శనాంశాలు గుర్తు చేస్తాయని డీడీజీ, హెచ్‌ఓడీ జీఎస్‌ఐ శిక్షణా సంస్థ డా.ఎస్.రవి అన్నారు. కార్యక్రమంలో జీఎస్‌ఐ డీడీజీలు, డైరెక్టర్లు, సీనియర్ జియాలజిస్టులు, ప్రజా సంబంధాల అధికారి డా.మల్లేష్ గంజి పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో శ్రీకాంతాచారికి ఘన నివాళి

ఎల్‌బీనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన తొలి అమరుడు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి చిత్రపటానికి న్యాయవాదులు, జేఏసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఉపేంద్ర, శ్రీధర్‌రెడ్డి, రవీంద్రరావు, అరుణ్‌కుమార్, ప్రదీప్, సదానందం, వంశీ, భిక్షమయ్య, నర్సింగోజు, నరేష్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మీదేవి, మాధవిలత, రమేష్, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

సైదాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు అన్నారు. మంగళవారం యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ బండ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ ఏడాది పాలనలో గ్యారెంటీల అమలుపై సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ రూపొందించిన చార్జ్‌షీట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరేందర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకపోగా ప్రజాధనంతో విజయోత్సవ సంబరాలు చేయడం విడ్డూరమని అన్నారు. ఏడాది పాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పితే కొత్తగా మరే పథకాలు అమలు చేయలేదని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని సీఎం రేవంత్ తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, మహేష్, మోహనకృష్ణ, రఘుకాంత్, యుగేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తించండి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్నారులూ ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తించండని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. మంగళవారం జీడీ గోయెంకా స్కూల్ నుంచి 23మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. టీటీఐ సిబ్బంది వారికి పార్కు గోడలపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల పోస్టర్లు, రోడ్ సైన్స్ చూపుతూ టీటీఐ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. లెక్చర్ హాల్‌లో వీడియో క్లిప్స్, సిమ్యూలేటర్‌పై సురక్షిత వాహన డ్రైవింగ్‌ను చూపించారు. హెల్మెట్ ప్రాధాన్యతను సైకిళ్లపై హెల్మెట్ వాడకం ప్రాధాన్యతను పిల్లలకు గుర్తుచేశారు. కార్యక్రమంలో టీటీఐ ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సేఫ్టీట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

11అవగాహన కార్యక్రమాల్లో 642మంది విద్యార్థులు

టీటీఐ అధికారులు, సిబ్బంది ఎల్బీనగర్, బాలాపూర్, హయత్‌నగర్, కొత్తపేట ప్రాంతాల్లో గల విద్యాసంస్థలను మంగళవారం సందర్శించి విద్యార్థులకు నిబంధనలపై అవగాహనకు వీడియో క్లిప్స్ ప్రదర్శించామన్నారు. 11 అవగాహన కార్యక్రమాల్లో 642 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



అల్కాపురి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అరవింద్‌శర్మ తదితరులు

ఎల్‌బీనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాలతో మంగళవారం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి ప్రభుత్వ పాఠశాలను డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి అరవింద్‌శర్మ సందర్శించారు. ఈసందర్భంగా స్కూల్‌లో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి ప్రిన్సిపాల్ అనిత, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అరవింద్‌శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి రోజు ఏదో ఒక గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమీక్షించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, పెంబరి శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్‌కుర్మ, జగన్, శ్రీరాములు, శ్రీకాంత్‌గౌడ్, నవీన్‌గౌడ్, కుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ షమీమ్ కమిషన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చిట్టుపాక ప్రభాకర్‌మాదిగ

2024 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలి

చాదర్‌ఘాట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 ఆగస్టు ఒకటో తేదీ నాటి లెక్కల ప్రకారంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్‌మాదిగతో కూడిన బృందం మంగళవారం జస్టిస్ షమీమ్ కమిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలు సుమారు 33లక్షల వరకు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన జనాభా ప్రకారం ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకటస్వామి, శ్రీనుమాదిగ తదితరులు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రామచంద్రారావు

కొత్తపేట : గుడికి వెళ్లి వస్తానని బయటకు వెళ్లిన వృద్ధు డు అదృశ్యమైన సంఘటన నాగోల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ బండ్లగూడ శ్రీఇంద్రప్రస్థకాలనీలో ఉండే ప్రైవేటు ఉద్యోగి శంకరమంచి సత్యనారాయణ తండ్రి శంకరమంచి రామచంద్రారావు(85). రామచంద్రారావు మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు కాలనీలో ఉండే ఆంజనేయస్వామి గుడికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఆయన ఇంటికి రాకపోవడంతో సత్యనారాయణ బంధువులను, తెలిసిన వాళ్లను సంప్రదిస్తూ అంతటా వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో అతడు నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మానసిక దివ్యాంగుల న్యాయసేవలకు ప్రత్యేక విభాగం

● సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

కొత్తపేట : రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం, జిల్లా న్యాయసేవల సంస్థలో జాతీయ న్యాయసేవల సంస్థ నిర్దేశాల మేరకు మానసిక దివ్యాంగులకు న్యాయసేవలు అందించడం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి పి.శ్రీదేవి ప్రకటించారు. కొత్తపేట మోహన్‌నగర్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగ జనుల దినోత్సవం సందర్భంగా మానసిక చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ సంయుక్తంగా దివ్యాంగులకు సుస్థిర భవిష్యత్తుపై భరోసా అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ హక్కుల సంరక్షణకు, ప్రభుత్వ పథకాలు అందకపోవడం, మానసిక దివ్యాంగులుగా ఉన్నందుకు విద్యాసంస్థల్లో ప్రవేశం లభించకపోవడం తదితర సమస్యలు ఉన్న వారు న్యాయసేవల కోసం తమను సంప్రదించవచ్చన్నారు. సమాజంలో దివ్యాంగుల హక్కుల సంరక్షణకు అందరూ చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పిల్లల సంక్షేమ కమిటీ పూర్వ చైర్మన్ పి.శ్యామలాదేవి, ఆహార భద్రత ప్రమాణాల జాతీయ సంస్థ డీడీ బాలునాయక్, ఉప్పల్, మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతాల తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ అత్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పహాడీషరీఫ్ : గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని బాలాపూర్ పోలీసులు మంగళవారం అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. అతని వద్ద నుంచి 48గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం మల్లాపూర్‌కు చెందిన దుబ్బా శ్రీనివాస్(56) నిషేధిత గంజాయిని విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. గతంలో నిందితుడిపై మీర్‌పేట, సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదై జైలుకు వెళ్లాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిఘాపెట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని హోటల్ యజమాని మృతి



అనిల్‌కుమార్(ఫైల్)

హయత్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, లోన్ ఇప్పిస్తామని కొందరు వ్యక్తులు మోసం చేయడంతో మనస్థాపానికి గురైన హోటల్ నిర్వాహకుడు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన కొల్లా అనిల్‌కుమార్(33) కొంత కాలం క్రితం హయత్‌నగర్‌కు వలస వచ్చి భాగ్యలత కాలనీలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా అక్కడే తాజా భోజనం హోటల్‌ను నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం స్నేహితుడి పుట్టినరోజు ఉందని భార్య ప్రవళికకు చెప్పి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రవళిక అనిల్‌కుమార్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తిరిగి ప్రవళిక ఐదు గంటలకు ఫోన్ చేయగా వారి బంధువైన హరికృష్ణ ఫోన్ లేపి నీ భర్త అనిల్‌కుమార్ భాగ్యలతలోని శ్రీ చైత్ర ఓయో లాడ్జిలో ఫ్యానుకు ఉరేసుకున్నాడని తెలిపాడు. వెంటనే ప్రవళిక వెళ్లి చూడగా హోటల్లో అనిల్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు.. లోన్ ఇప్పిస్తామని కొందరు వ్యక్తులు మోసం చేయడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనిల్‌కుమార్ భార్య ప్రవళిక మంగళవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.